గాడి తప్పిన గ్రామ స్వరాజ్యం

- సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యం
- నిర్వీర్యం చేసేందుకు కూటమి ఎత్తుగడ
- అలంకారప్రాయంగా కార్యాలయాలు
- సేవలు అందక ప్రజల అవస్థలు


చిలంకూరు గ్రామ సచివాలయం

సచివాలయాలు	
యర్రగుంట్ల మండలం	14
మున్సిపాలిటీ	9

ఎర్రగుంట్ల : మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. ఇందులో భాగంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. తద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చింది. అయితే కూటమి ప్రభుత్వం క్రమంగా గ్రామ స్వరాజ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేసింది. సచివాలయ వ్యవస్థను కూడా నీరుగార్చేలా చేస్తోంది. సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేసి వ్యవస్థనే దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. దీంతో గ్రామ స్వరాజ్యం గాడి తప్పి పాలన అస్తవ్యస్తంగా తయారవుతోంది.

కార్యాలయాల చుట్టూ తిరగకుండా..

మండల కేంద్రానికి దూరంగా ఉండే గ్రామాల ప్రజలు 2019కి ముందు వరకు.. ప్రతి చిన్న సమస్యకు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు పరుగులు పెట్టేవారు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడేవారు. కూలి పని చేసుకునే వారైతే ఆ పనులు మానుకుని రోజంతా కార్యాలయాల చుట్టూ తిరిగే వారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పరిస్థితికి చెక్ పెట్టేలా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంత ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన పని లేకుండా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి భవనాలు నిర్మించింది.

ఎన్నో సేవలు

మండల పరిధిలో 12, మున్సిపల్ పరిధిలో 9 సచివాలయలు ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాల్లో 11 శాఖల అధికారులు అక్కడే ఉండి ఎన్నో సేవలు అందించారు. ఆధార్ కార్డుల మార్పులు చేర్పులు, విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు వెంటనే సమీపంలో ఉన్న సచివాలయానికి వెళ్తే సకాలంలో అందేవి. సంక్షేమ పథకాలకు సులువుగా దరఖాస్తు చేసుకునే పరిస్థితులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది.

నాడు కళకళ.. నేడు వెలవెల

ప్రస్తుతం రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు అర్హత ఉన్న లబ్ధిదారులు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ఏ పని కావాలన్నా ఒక వైపు గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పథకాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన పనులు చేసే వారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఏ పనులు జరగక చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అంటున్నారు.

ఈ ప్రభుత్వం నీరుగార్చింది



ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించాలనే ప్రధాన సంకల్పంతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. వలంటీర్ల ద్వారా పథకాలు ఇంటి తలుపులు తట్టేవి. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థనే నీరుగార్చే విధంగా చేసింది. సచివాలయలో ఏ పనులు జరగడంలేదు. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

– సుధాకర్‌రెడ్డి, పోట్లదుర్తి గ్రామం, ఎర్రగుంట్ల మండలం

సేవలను అందుబాటులోకి తేవాలి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సచివాలయంలో చాలా రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వివిధ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ప్రజలు సేవల కోసం సచివాలయాలకు వచ్చి వెనుదిరిగి పోతున్నారు. సచివాలయంలో అన్ని సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

– వర్రా దేవిడ్, ఎర్రగుంట్ల పట్టణం

నేడు గ్రామోత్సవం

కమలాపురం : పట్టణంలో వెలసిన అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ గురుస్వాములు డాక్టర్ కె.నరసింహాశర్మ, నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నె స్వాముల కలశాలు, ముత్తయిదువుల దీపాలతో బాణ సంచా పేల్చుతూ, మేళ తాళాలు, భజనలతో శబరిమలై ఆచార వ్యవహార, తాంత్రిక పద్ధతులతో శోభాయమానంగా, అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణ

జమ్మలమడుగు రూరల్ : నిరుద్యోగ యువతి, యువకులకు కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి విజయ వినీల్ కుమార్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేంద్రనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అంబవరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగులకు వెబ్ డెవలప్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం కోర్సులపై శిక్షణ ఇస్తామని వారు పేర్కొన్నారు. తరువాత ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని సూచించారు. అభ్యర్థులు కనీసం డిగ్రీ పాస్ అయిఉండాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 9000479991, 9398811689కు సంప్రదించాలని వివరించారు.

క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు


బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణం చిన్నరంగాపురం సచివాలయ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలోని మురికి కుంట వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లి ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి


కొండమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఉండేలా ఓబుల్‌రెడ్డి సతీమణి కొండమ్మ సోమవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి వారి ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు జీఎన్ భాస్కర్‌రెడ్డి, సురేష్ యాదవ్, కొండపేట ఎంపీటీసీ నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ చంద్ర, నిరంజన్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ


భవానీ శంకర ఆలయంలో అన్నసంతర్పణ

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కార్తిక మాస ముగింపు పూజలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాల్లో పూజలు నిర్వహించి నెల రోజులుగా వెలిగిస్తున్న ఆకాశ దీపాలను కిందికి దించారు. శివునికి అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజలు చేశారు. వల్లూరులోని శ్రీ భవానీశంకర ఆలయంలో పూజల్లో భాగంగా అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ చక్ర సహిత భవానీ మాతకు అర్చన చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


మెమెంటోతో విద్యార్థినులు

పెద్దముడియం : మండల పరిధి పెద్దపసుపల గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 9వ తరగతికి చెందిన టి.వెంకటహారిక, నాగ దివ్యశ్రీ, మౌనిక, దీక్షిత తృతీయ స్థానం సాధించారని పాఠశాల ఎస్‌వో మౌనిక తెలిపారు.

వరి పొలం పరిశీలన

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని చిన్నమాచుపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. అలాగే ఆరబోసిన ధాన్యాన్ని చూసి రైతులతో మాట్లాడారు. రంగుమారడం వల్ల మార్కెట్ ధర తక్కువగా ఉందని రైతులు తెలియజేశారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా ధాన్యం కొనుగోలుకు సిఫారసు చేస్తానని వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కమలి, సునీల్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీడీఎస్ సిబ్బంది

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు గాంధీ సర్కిల్ వద్ద సోమవారం హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ క్లస్టర్ ప్రాజెక్టు మేనేజర్ వల్లి హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చికిత్స, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపించరాదు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సీడీఎస్ సిబ్బంది నాగిన్ బాషా, శాంతి, అనురాధ, మేరీ, పుష్ప రాజు, కమ్యూనిటీ మహిళలు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు సహకరించండి


ఎమ్మెల్సీకి నరసింహారెడ్డి విగ్రహాన్ని అందిస్తున్న ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన నివాసంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిసి నరసింహారెడ్డి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఎక్కడా నరసింహారెడ్డి విగ్రహం లేదని కాబట్టి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పులివెందుల పట్టణంలోని ఏదో ఒక కూడలిలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాయలసీమ కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలేయ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం


బాధితురాలి తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

పులివెందుల టౌన్ : కాలేయ వ్యాధిగ్రస్తు చిన్నారి చికిత్స కోసం దాతలు ఆర్థిక సాయం అందించారు. చిన్నారి తండ్రి మహమ్మద్ రఫీకి అమ్మ సేవా సమితి అధ్యక్షుడు పూల రమేష్, కార్యదర్శి సాగర్ బాబు రూ.30 వేలు అందజేశారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల హెచ్‌పీ గ్యాస్ సమీపంలో ఉన్న ఆర్వీ న్యూట్రిషన్ హెల్త్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి దయనీయ స్థితిని తెలుసుకున్న రమేష్ మిత్ర బృందం స్పందించి ఈ సాయం చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథ్‌రెడ్డి, న్యూట్రిషన్ హెల్త్ సెంటర్ నిర్వాహకులు పెద్ద వీరయ్య, దాతలు అల్లిపీరా, మల్లికార్జునరెడ్డి, నారాయణస్వామి, బాబా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ, ఎంఎస్ఎంఈలను తరలించవద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రసాద్

చింతకొమ్మదిన్నె : కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయం, ఎంఎస్ఎంఈ సంస్థను తరలించవద్దని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి మడగలం ప్రసాద్ అన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాయలసీమ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్లకు వినతిపత్రం అందించే కార్యక్రమంలో భాగంగా చింతకొమ్మదిన్నె మండలంలోని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే వివిధ రకాల సంస్థలు, పరిశ్రమలతోనే సాధ్యమవుతుందన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమను మరింత అభివృద్ధి చేయాల్సిన పాలకులు ఉన్న సంస్థలను కూడా తరలించుకుపోయి కరువులోకి నెట్టివేయడం తగదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నంతకాలం నుంచి రాష్ట్రాన్ని పరిపాలించింది రాయలసీమ వాసులేనని, అయినా రాయలసీమ వెనుకబడి ఉన్నదన్నారు. దానికి కారణం పరిపాలన మాత్రమే రాయలసీమ వాసులు చేసారని, అభివృద్ధి అంతా కోస్తా, తెలంగాణ ప్రాంతాలలో జరిగిందన్నారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌లో అయినా రాయలసీమ అభివృద్ధి చేస్తారని ఆశిస్తే ఉన్న సంస్థలు, పరిశ్రమలను కూడా తరలించుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో ఉన్న ఏ సంస్థలను తరలించవద్దని, కూటమిపై ఎంతో విశ్వాసంతో అధికారంలోకి తెచ్చిన ఈ ప్రాంత ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. చేతనైతే మరి కొన్ని సంస్థలు, పరిశ్రమలు, కార్యాలయాలను ఈ ప్రాంతంలో నెలకొల్పి ప్రజా ఆదరణ పొందాలని సూచించారు.

పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు కీలకం


అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం అని మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వివిధ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. కావున మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఎంఈఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ వ్యవస్థపై పర్యవేక్షణ కరువు


పులివెందులలో ట్రాఫిక్‌తో నిలిచిపోయిన వాహనాలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థపై పర్యవేక్షణ కరువైంది. ముఖ్యంగా సోమవారం ఈ సమస్య స్పష్టంగా కనిపించింది. స్థానిక డిగ్రీ కళాశాల రోడ్డు సమీపంలో శ్రీమిట్ట మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద అయ్యప్ప స్వామి మండల పూజా కార్యక్రమాన్ని సోమవారం ఎంతో వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తులతో పాటు పులివెందుల నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఏటా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంది. మండల పూజ కార్యక్రమం సందర్భంగా వారు బందోబస్తు ఏర్పాటు చేయాలి. కానీ పోలీసులు ఎక్కడా కనిపించలేదు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు చేతులెత్తేశారు. దీంతో డిగ్రీ కళాశాల రోడ్డులో వాహనాలు సుమారు గంటపాటు నిలిచిపోయాయి. దీంతో అయ్యప్ప భక్తులు, వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

నేడు వైద్య శిబిరం

లింగాల : లింగాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు అందించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కావున ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్‌పీఎం నంబర్లు రాక వన్‌బీకి ఇక్కట్లు

వేంపల్లె : మండలంలోని ముత్తుకూరు, నాగూరు, రామిరెడ్డిపల్లె, అయ్యవారిపల్లె, కత్తులూరు, అమ్మగారిపల్లె, పాములూరు తదితర గ్రామాల్లో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేతో.. మండలంలోని భూమి రికార్డుల స్వరూపం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ఉన్న సర్వే నంబర్లు కనుమరుగై వాటి స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) నంబర్లు రానున్నాయి. అయితే రీ సర్వే చేసిన 60 శాతం మంది రైతులకు సంబంధించి ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) నంబర్లు రాక వన్ బీ, అడంగళ్లు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ 15లోగా రైతులు పంటల ప్రీమియం చెల్లించేందుకు గడువు ఇచ్చారు. అందుకు ప్రీమియం చెల్లించేందుకు వన్–బీ లేకుంటే ఆన్‌లైన్‌లో తీసుకోకపోవడంతో రైతులకు శాపంగా మారింది. మండలంలో ఎక్కువగా మినుము పంటకు తెగుళ్లు సోకి రైతులు చాలా నష్టపోయారు. రీ సర్వేతో వన్–బీ రాకపోవడంతో చాలామంది ప్రీమియం చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే పంటల ప్రీమియం చెల్లించే సమయం అయిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ మాన్యువల్ వన్ బీ ఇచ్చినా ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించేందుకు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ హరినాథ్ రెడ్డిని వివరణ అడగగా.. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో ఒక ఐడీ(ఎల్‌పీఎం) నంబర్ వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో భూములు రీ సర్వే చేయడంతో వన్–బీ రావడం లేదన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలిపామని, త్వరలో ఎల్‌పీఎం నంబరు ఇస్తే వారికి వన్–బీ వస్తుందని వివరించారు.

పేదలకు సాగు భూమి ఇచ్చే వరకు పోరు

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర


ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

పులివెందుల రూరల్ : పేదలకు రెండు ఎకరాల సాగు భూమి, నిరుపేదలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని, ఎన్నికలలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య, దళిత కుల పోరాట సమితి, దళిత డప్పు కళాకారుల సంఘాల ఆధ్వర్యంలో పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో సాగు భూమికి అర్హులైన సుమారు 500 మంది అర్జీదారులతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు రెండు ఎకరాల సాగుభూమి కేటాయించడానికి పాలకులు కృషి చేయడం లేదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అధికారులు కూడా ఆ పార్టీ నేతల సూచనలతో కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో ఉన్నటువంటి నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో దశలవారీ ఉద్యమంగా ఆయా డివిజన్లలో ఉన్న అర్హులైన పేదల జాబితాను సిద్ధం చేయడానికి నిద్రలో ఉన్న అధికారులను తట్టి లేపడానికి ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రతి గ్రామంలో అర్హులైన పేదల జాబితా సిద్ధం చేయాలని, సిద్ధం చేసిన జాబితాలను అసైన్డ్ కమిటీకి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. అలా లేని పక్షంలో ఈ జిల్లాలోని అర్హులను సంఘటితం చేసి పెద్ద ఎత్తున కడప కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునయ్య, దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీ బాదుల్లా, చంద్రశేఖర్, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి కొత్త కాల్వ బ్రహ్మం, బాషా, ఇమ్మానుయేలు, విద్యార్థి సంఘ నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో దుష్పరిణామాలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చింతకొమ్మదిన్నె : మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక దుష్పరిణామాలు తలెత్తుతాయని, ఆరోగ్య పరంగా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం నాశనం కావడమే కాకుండా తమను నమ్ముకున్న వారికి అన్యాయం చేసిన వారవుతారన్నారు. చివరికి అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉందన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కె.జయరాజు మాదక ద్రవ్యాలు, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువత మత్తుకు ఎలా అలవాటు పడుతున్నారో, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కొందరు వీటి కోసం డ్రగ్ మాఫియా వారికి సహకరించడం, దాని నుంచి ఎలా కాపాడుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు రవికుమార్, కృష్ణకుమార్, కళాశాల అధినేత చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్‌మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప


అంబులంలో కొలువు దీరిన దేవతామూర్తులు


అయ్యప్పస్వామి మండల పూజలో భక్తులు

- ఘనంగా మండల పూజ మహోత్సవం
- కనుల పండువగా గ్రామోత్సవం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీఅయ్యప్ప స్వామి 39వ మండల పూజ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రాంతఃకాలంలో యాగశాల ప్రవేశం ఆచరించి గణపతి పూజ, హోమాలను జరిపించి, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అరటి మొదులతో తయారు చేసిన అంబులంపై శివపార్వతులు, గణపతి, కుమారస్వామి, అయ్యప్ప స్వాములను కొలువు తీర్చి ప్రత్యేక పూజలు జరిపించారు. పడిమెట్ల పాట పాడి భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. స్వామియే శరణం అయ్యప్ప శరణుఘోషతో ఆలయం మారుమోగింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న అయ్యప్పస్వామిని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేల సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వర్షంలోనూ వైభవంగా గ్రామోత్సవం

మండల పూజ అనంతరం సాయంత్రం జోరుగా వర్షం కురుస్తున్నా అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని భక్తులు భక్తిపారవశ్యంతో వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో గురుస్వామి సుబ్బారెడ్డి అయ్యప్ప స్వామికి ఎదురుగా కర్పూర జ్యోతిని పట్టుకుని భక్తులకు హారతి దర్శనం కల్పించారు. ఈ ఉత్సవం వెంట ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీఅయ్యప్పస్వామిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. స్వామివారి వెంట 10 ఏళ్లలోపు బాలికలు జ్యోతులను పట్టారు. భజనలు, కోలాటం, మంగళ వాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, డీజే శబ్దాల నడుమ దీక్షదారుల ఆనందోత్సవాలు పట్టణ ప్రజలకు నేత్రానందం కలిగించాయి. పట్టణంలోని గుంతబజార్, అమ్మవారిశాలవీధి, మెయిన్‌బజార్, పూలంగళ్ల సర్కిల్, ముత్యాలవారివీధిల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి కాయ, కర్పూరాలను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. గ్రామోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.


స్వామిని దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి


గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం


ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు